

# మ్యూజికల్ మ్యూజింగ్స్
## - కస్తూరి మురళీకృష్ణ



### (ప్రారంభం)

**జబ్ దిల్ కో సతావే గమ్, ఛేడ్ సఖీ సరగమ్.**

'సరగమ్' సినిమాలో లతా మంగేష్కర్, సరస్వతీ రాణేలు, సి. రామచంద్ర సంగీత దర్శకత్వంలో పాడిన పరమ రమణీయమైన గీతం ఇది. సంగీత శక్తిని అత్యంత సరళంగా ప్రదర్శించే పదాలనీ బాణీకి తగ్గట్టు కూర్చింది గేయరచయిత పి.ఎల్. సంతోషి.

ఈ పాట వింటూంటే మనసు రెక్కలు కట్టుకుని ఆకాశంలో విహరిస్తుంది. సినిమాపాట చిత్రీకరణ కూడా అత్యంత రమణీయంగా ఉంటుంది. ఇంటిల్లపాదీ కూర్చుని ఆనందంగా పాటపాడుతూ సంగీతం గొప్పతనాన్ని పాటద్వారా ప్రకటిస్తూంటే శాస్త్రీయ సంగీతంలోని ఆత్మను కదిలింపగల శక్తి అనుభవానికి వస్తుంది.

బడా జోర్ హై సాత్ సురోమే

బహతే ఆసూ జాతే హై థమ్

పాట వినటం అంటే, సంగీతంలో నిబిడీకృతమైన మాధుర్యాన్ని అనుభవించటం. ఆ మాధుర్యం మనస్సులో లోతుల్లో జాగృతం చేయుగల అనుభూతుల స్వరూపాన్ని అర్థం చేసుకోవటం. అస్పష్టరూపంలో కదులుతూన్న భావాలను అవగాహన చేసుకోవటం. ఎందుకంటే సంగీతం స్వతంత్ర కళ అయినా, సంగీతం సృజించగల భావాలను, దృశ్యాలను అనుభవించగలగటం అందరికీ సాధ్యంకాదు. కేవలం రాగాన్ని విని అనుభూతి సంపూర్ణ స్వరూపాన్ని అనుభవించటం అందరికీ కుదరదు. ఇలాంటి పరిస్థితిలో సంగీతానికి సంపూర్ణత్వాన్ని ఆపాదిస్తుంది సాహిత్యం. శిశువు, పశువు గానాన్ని అనుభవిస్తాయి. తలలూపుతాయి. శరీరంతో స్పందిస్తాయి. ఆత్మలోని సున్నితత్వం జాగృతం అవుతుంది కానీ సంగీతానికి సాహిత్యం తోడవకపోతే ఆ సంగీతాన్ని అధిక సంఖ్యలో ప్రజలు అనుభవించలేరు. అయితే సాహిత్యం సంగీతానికి వన్నె తెచ్చి, దానిలో నిబిడీకృతమై ఉన్న భావాన్ని, ఆలోచనను ప్రదర్శించేదయితే ఆ గీతం ప్రభావం అత్యంత గొప్పది. సాహిత్యానికి ఈ శక్తి ఉంది. సంగీతం ఒక ముద్దలాంటి భావనను కలిగిస్తే, ఆ ముద్ద స్పష్టమైన ఆకృతినిచ్చి నిలుపుతుంది సాహిత్యం. పదాలకు ఆ శక్తి ఉంది. విడిగా కూడా పదాలకు దృశ్యాలను చిత్రించే శక్తి ఉంది. భావాలను కలిగించే శక్తి ఉంది. సంగీతం కన్నా సులువుగా సాహిత్యం వ్యక్తుల మనస్సులలో స్పందన కలిగిస్తుంది. కానీ సంగీతం, సాహిత్యం రెండూ కలిస్తే ఇక స్వర్గమే. తీరాన్ని బలంగా తాకి వెనక్కు తిరిగి వస్తూన్న అల, తీరం బలంగా తాకేందుకు ముందుకు దూకుతూ వస్తూన్న అల రెండూ ఒక దశలో కలుసుకుంటాయి. ఆ రెండూ ఒకదానికొకటి ఊపునిచ్చుకుంటే, రెండూ కలసి ఒక శక్తివంతమైన అల శరీరాన్ని అలగా మారి తీరాన్ని ఎత్తుకు ఎగురుతుంది. దీన్ని వైజ్ఞానికపరిభాషలో 'constructive interference'అంటారు. అందుకు భిన్నంగా రెండూ ఒకదానికి మరొకటి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే, అల బలహీనమైపోతుంది. 'destructive interference'అంటారు. సంగీతం, సాహిత్యాల కలయిక కూడా ఇలాంటిదే ఒక అందమైన, ఆకర్షణీయమైన బాణీ కుదిరితే చాలదు. ఆ బాణీ మాధుర్యాన్ని ప్రస్ఫుటం చేస్తూ, ఆ బాణీ సృజించే భావాన్ని ఉద్దీపితం చేసే పదాలు ఆ బాణీలో పొదిగితే ఇక ఆ గీతం శ్రోతల మనస్సులకు రెక్కల నిచ్చి విశాల వినీల భావాంబర వీధులలో

విశృంఖల విహారం చేయిస్తుంది. ఇక బాణీకి, సాహిత్యానికి తగ్గ స్వరం లభిస్తే... ఇక బ్రహ్మానందం అనుభవించటానికి రాచబాట సిద్ధంగా ఉన్నట్టే.

'మానవస్వరం' ఒక అత్యద్భుతమైన వాయిద్యం. మనిషి సృజించిన వాయిద్యాలు ఎన్నెన్నో చిత్రవిచిత్రమైన పోకడలు పోతాయి.. జీవం లేకున్నా తమ ద్వారా పలునాదాలలో సజీవమైన భావాలను ప్రకటిస్తాయి. కానీ మానవ వాయిద్యంలోని ఆర్తి, ఆర్ద్రత, చైతన్యం ఇతర ఏ వాయిద్యంలో ఎంతెంత నిష్ణాతులు ఎన్ని ప్రయత్నాలు చేసినా పలికవు వాటికి పరిమితులున్నయి. పరిమితులు లేనిది మానవ కంఠస్వరనాదమే. ఎలాగయినా సంగీత శక్తిని తెలిసి ఎంచుకున్న రాగం, శబ్దశక్తి తెలిసి కూర్చిన పదం రసానుభూతి పరాకాష్టకు కారణమవుతాయో, అలాగే సంగీత శక్తి, శబ్దశక్తితోపాటు మానవస్వరం శక్తి తెలిసిన గాయకుడు కానీ గాయనికానీ గీతాలాపన చేస్తే 'బ్రహ్మానందమే. ఇక తన్మయత్వం, వివశత్వం రెక్కలు కట్టుకుని మనిషిని ఒక సమాధిస్థితి వరకూ లాక్కు వెళ్తాయి. దాదాపుగా వ్యక్తి తనని తాను మరచి, తన శరీరాన్ని విస్మరించి 'తాను' అన్న భావనను విడిచి స్వరరస ప్రవాహంలో తన అస్థిత్వాన్ని విడచి మునకలు వేస్తాడు. ఇది 'పాట' ప్రభావం.

ఇలాంటి పాటలు వినగలగటం, వాటి మాధుర్యాన్ని అనుభవిస్తూ, అనంతమైన ఆనంద రసప్రవాహంలో ఈదులాడగలిగిన వాడికి దుఃఖం అన్నది ఉండదు. సుఖదుఃఖాలకు అతీతమైన ఆనంద ధ్యాన స్థితిని అనుభవించినవాడిని మామూలు వేదనలు అంటలేవు. ఈ పాటలో పదాలు అదే అంటున్నాయి.

బడా జోర్ హై సాత్ సురోమే, బహతే ఆసూ జాతే హై థమ్.

సప్తస్వరాలలో ఎంత శక్తి ఉందంటే, కారే కన్నీరు స్థంభించి పోతుంది. అంటే హృదయంలోని వేదన అదృశ్యమైపోతుందన్నమాట. అందుకే గేయరచయత ఆరంభంలోనే హృదయంలో ఏదైనా బాధ ఉన్నప్పుడు, హృదయాన్ని ఏదైనా బాధిస్తున్నపుడు గీతాన్ని ఆలపించమంటున్నాడు. ఎందుకంటే సప్తస్వరాలలో దుఃఖాన్ని నిర్జించగల శక్తి ఉంది.

అత్యద్భుతమైన బాణీకి అంత అద్భుతమైన రచన ఇది. ఇక ఈ పాటను పాడిన లతా మంగేష్కర్ గురించి ఏమి చెప్పినా తక్కువే. 'సరస్వతిదేవి' మానవులకు తన వీణామాధుర్యాన్ని అనుభవానికి తెచ్చేందుకు లత స్వరాన్ని తన వీణలా చేసుకుందేమో అనిపిస్తుంది. కొన్ని పాటలు వింటుంటే సరస్వతీదేవి లత స్వరం ద్వారా ప్రకటితమవుతుందేమోనన్న భావన కలుగుతుంది. సరస్వతీ రాణే ప్రఖ్యాత సంగీత విద్వాంసురాలు. సినిమా పాటలు అతి తక్కువగా పాడింది. ఆమె లతతో కలిసి పాడటం వల్ల సినీగీతానికి శాస్త్రీయ సంగీతం స్థాయి వచ్చినట్టయింది.

నిజానికి పలువురు సినీసంగీతాన్ని సంగీతంగానూ, సినీగేయ రచనను సాహిత్యంగానూ, సినీగానాన్ని 'గానం'గానూ పరిగణించరు. అది వారి ఇష్టం కానీ ఆధునిక సమాజం కొన్ని తరాలుగా సినీసంగీతంలోనే మునిగితేలుతోంది సంగీతం అంటే సినిమా సంగీతమే. సాహిత్యం అంటే సినిమా పాటలే. గానం అంటే సినీగీతాల గానం. అలాంటి పరిస్థితులలో సినీ సంగీతాన్ని విశ్లేషించకుండా, అధ్యయనం చేయకుండా విస్మరించటం కూడని పని. సినీ సంగీతాన్ని విశ్లేషించాలి. సాహిత్యాన్ని విశ్లేషించాలి అనేక గొప్ప కవులు, గేయ రచయితలై సినిమా గేయానికి సాహిత్య గంధం పూసి, సినిమాపాటకు సాహిత్య స్థాయిని ఆపాదించిన వైనం విశ్లేషించుకోవాలి. లేకపోతే సమాజంపై అత్యంత ప్రభావం చూపించే అంశాన్ని విస్మరించి ఉష్ణపక్షుల్లా ఇసుకలో తల దూర్చి అంతా చీకటిగా ఉందనుకున్నట్టవుతుంది.

సినీసంగీత కళాకారులు, సంగీత దర్శకుడు కావచ్చు, గీత రచయిత, గాయనీగాయకులు కలసికట్టుగా పరమాద్భుతమైన గీతాలను సృజించారు. తమ తమ వ్యక్తిగత ఇష్టాఇష్టాలు, అహంకారాలను పక్కనపెట్టి, అస్తిత్వాలను వదులుకుని మరీ వారు సృజించిన మధురమైన గీతాలు వారి వారి వ్యక్తిత్వాలకు ప్రతీకగా నిలవటం ఒక విశేషం. నిజానికి సినీగీతాల సృజనలో ఎన్నో పరిమితులుంటాయి. సందర్భ పరిధిలో పాట వొదగాలి పాత్రల వ్యక్తిత్వాల ఔచిత్యాన్ని పాటించాలి. నిర్మాత సంస్కారాన్ని మెప్పించాలి. ఇంత చేసీ ప్రజలను

ఆకర్షించాలి. సినిమా చూసేవారు అన్ని వర్గాలవారు, అన్ని స్థాయి ప్రేక్షకులు, పండితులు, పామరులూ ఉంటారు. అందరినీ మెప్పించాలి. ఇదంతా సాధించటం కళాకారులు తమతమ పరిమితులు, వ్యక్తిగత పరిధులలో ఒదిగి పనిచేయాలి. కళాసృజన చేయాలి ఈ పరిధులను, పరిమితులను అధిగమించి మరీ సినీకళాకారులు ఉన్నత స్థాయి గీతాలను సృజించారు. సినీ సందర్భ పరిధిలో ఒదుగుతూ కూడా గీతానికొక సార్వజనీనతను ఆపాదించారు.

సినిమాలో సంగీత ప్రేమికులయిన కుటుంబ సభ్యులంతా కలసి సంగీతం పాడుకునే సందర్భంలోని పాట ఇది. ఈ పాటలో పొదిగిన పదాలు, వాటి భావాలు పాటను సినీ సందర్భం దాటి ఎదిగింపచేస్తాయి. సంగీతం గొప్పదనం, సంగీతప్రాధాన్యాన్ని విస్పష్టం చేస్తాయి. సంగీత ప్రేమికులకు అంతులేని ఆనందాన్ని కలుగచేస్తాయి.

రంగ్ బిరంగీ సాత్ బదలియా
కాటోంకో జో కర్‌కే కలియా
లాగ్ ఏక్ నయా మౌసం

సప్తస్వరాలు, సప్త వర్ణాల మేఘాలట. ఇవి ఎపుడయితే ప్రకటితమవటం ఆరంభిస్తాయో అప్పుడు ముళ్లను కూడా మొగ్గలుగా మారుస్తాయి. ఒక కొత్త ఋతువును ఆవిష్కరింపచేస్తాయి. అంతేకదా, వర్షించే కళ్లనుండి కారే నీటిచుక్కలు సుందర పుష్పాలుగా మార్చే సంగీతం నూతన ఋతువులను ఆవిష్కరింపచేయటంలో ఆశ్చర్యమేముంది?

అనుభవించలేనివాడికి వేర్వేరు ఋతువులు కానీ 'కళ'ను అనుభవించే సహృదయం ఉన్నవాడికి ఋతువుతో సంబంధం లేకుండా ప్రతిరోజూ వసంత ఋతువే. ప్రతిక్షణం ఆనందమయమే. ఈ ప్రపంచం ఆనంద మహా సముద్రం.

సాత్ సురోంకేసాథ్ హై ఝూలే
జో ఝూలే వో సబ్ కుఛ్ భూలే
రహే మగన్ హర్ దమ్.

సప్తస్వరాలను అనుభవించే శక్తి కలవాడు సర్వం మరచిపోతాడు. నిత్యం సప్తస్వరాలు సప్తసముద్రాల అలలపై ఓలలాడుతూ ఆనందంగా జీవిస్తాడు. ఎలాంటి బాధ అతనిని తాకలేదు.

ఇదీ పాట.

ఈ పాటని ఇక్కడ చూడొచ్చు.. **Click Here**

నిజానికి ఈ పాటకోసం ఎంచుకున్న బాణీ అత్యంత విలక్షణమైనది సి. రామచంద్రను సంగీత విమర్శకులు పాశ్చాత్య బాణీలను పెద్ద ఎత్తున హిందీ సినిమాకు దిగుమతి చేసినవాడిగా విమర్శిస్తారు. సినీగేయాలతో సాహిత్యానికి అందరూ ప్రాధాన్యం ఇస్తున్న సమయంలో ఎలాంటి గీతానికయినా బాణీని కట్టే సంగీత దర్శకుడు సాహిత్యాన్ని పట్టించుకోడని ఆరోపిస్తారు. కానీ సి.రామచంద్ర ప్రధానంగా ఆకర్షణీయమైన బాణీని సృజించటం పై దృష్టిపెడతాడు. కర్ణాటక సంగీతంలో సరిగమప వంటి సప్తస్వరాల ఆధారంగా అంటే మౌలిక స్వరాల గానంతో బాణీని కట్టే పద్ధతిని గమనించిన సి.రామచంద్ర, ఉస్తాద్ అబ్దుల్ కరీమ్ ఖాన్ మరాఠీ నాటకాలలో వాడిన 'సుర్ సుఖ్ ఖానీ తు విమలా' వంటి గీతాల ప్రభావంతో సృజించిన గీతం 'జబ్ దిల్ కొ సతావే గం' అందుకే, హిందీ సినీ గీతాలలో అతి తక్కువ పాటల్లో 'స్వరప్రస్తారం'వుంటుంది. అలాంటి అరుదైన పాటలకు ఆద్యం అనదగినదీపాట. కర్ణాటక సంగీత సభ వయోలిన్‌కూ, గాయకుడికీ నడుమ జరిగే జుగుల్బందీని పాటలో ప్రవేశపెట్టి అత్యద్భుతమైన ప్రభావాన్ని సాధించాడు ఈ పాటలో సి. రామచంద్ర ముఖ్యంగా పాట చివరలో చప్పట్లు తాళానికి ఊపునిస్తూ శాస్త్రీయ సంగీతం మనసునే కాదు శరీరాన్ని కూడా ఊపగల శక్తి కలదని నిరూపించాడు. ఒక అత్యద్భుతమైన ప్రయోగం భవిష్యత్తులో 'నాస్తిక్' సినిమా 'కాణా బజాయే బాసురీ', నవరంగ్‌లో 'జారే

జారె అరే నట్ ఖట్' పాటల చివరలో కూడా ఇలాంటి ప్రయోగాన్నే ఇంకా పెద్దస్థాయిలో చేసి శ్రోతలను ఉర్రూతలూపాడు. పాశ్చాత్య సంగీతం శరీరాన్ని మాత్రమే ఊపితే, భారతీయ సంగీతం శరీరాన్ని, ఆత్మనూ స్పందింపచేయగల శక్తి కలదని ప్రదర్శించాడు. ఇంక ఈ పాటలు సంగీతం తెలియని పామరుడూ సులభంగా పాడుకుని ఆనందించగలడు. ఇదీ సినీకళాకారులు శాస్త్రీయ సంగీతాన్ని సామాన్యులు సైతం వీధివీధినా పాడుకుని ఆనందించగలిగేట్టు సినిమా పాట రూపంలో అందించిన వైనం. అందుకే సినిమా పాటలను తేలికగా కొట్టేసే వీలులేదు. ఈ పాట విన్న వ్యక్తికి ఇది అసావేరి రాగమా, జాన్ పురి రాగమా, దేవ గాంధర్వరాగమా అన్నది అవసరంలేదు. పదాలు సృజించే భావం, గాయనిల స్వరాలు కలిగించిన మాధుర్యం, ఇతర వాయిద్యాలు కలగలసి ఉద్దీపన చేసిన ఒక వినూత్న ప్రపంచం ఇవేకావాల్సినవి. వీటి ద్వారా తన ప్రమేయం లేకుండానే శ్రోత రసాస్వాదనలో కొన్ని మెట్లెక్కుతాడు. ఉత్తమ కళ వ్యక్తిలోని ఉత్తమత్వాన్ని జాగృతం చేసి ఉన్నతుడిని చేస్తుంది. ఇందుకు ఉత్తమంగా, ఉన్నతంగా రూపొందించిన సినీగీతాలు చక్కని ఉదాహరణలు.

నెలనెల వెలువడే ఈ శీర్షికలో హిందీ, తెలుగు, ఆంగ్ల పాటలు, వాటిలోని ఇంపులు, సొంపులు, ప్రయోగాలు, ప్రయోజనాల గురించిన ఆలోచనలు విశ్లేషణలుంటాయి. సినీ సంగీతం ద్వారా అత్యత్తుమ స్థాయి కళాకారులు సృజించిన పరమోత్కృష్టమైన కళా ప్రపంచం తాలూకూ విశేషాలుంటాయి. కలసి ఉత్తమ కళను ఆహ్వానిద్దాం. ఉత్తమ కళను ఆస్వాదిద్దాం. ఉత్తమ మానవుడిగా ఎదుగుతూ భవిష్యత్తు తరాలకు ఉత్తమమైనదాన్ని అందిస్తూ సాగుదాం. ఇదీ మ్యూజికల్ మ్యూజింగ్స్ శీర్షిక లక్ష్యం. ఉద్దేశ్యం.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments